# జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును

బృందారకస్వామిగారు పద్యగద్య రచనలు, వచన కవితలు, కథలు, వ్యాసాలు, ప్రాచీనం, మధ్యయుగం, ఆధునికం, చదివి ఆనందించడమే కాక, రాయడం కూడా అలవరుచుకున్నారు. అయితే తను సొంతంగా పెద్ద పెద్ద నోటు పుస్తకాల్లో రాసుకుని ఆనందిస్తున్నారే తప్ప, ఏ పత్రికలకూ పంపలేదు. పంపితే ఆయా పత్రికల వారు వేద్దురో మాందురో అది వేరే సంగతి. అటు గ్రాంథిక భాష, ఇటు వాడుక బాష రెండింటిలోనూ ఆయనకు ప్రావీణ్యం వుందని అనను గాని, ప్రవేశం మాత్రం వుంది.

ఒకనాడు బృందారకస్వామిని కలిసి "మీ భావాల్ని మీలోనే అణచేసుకుంటే ఎలా? నలుగురికీ ఎలా తెలుస్తుంది?" అన్నాను. "నేను కేవలం ఆత్మానందానికి ఈ రచనలు చేసుకుంటున్నాను తప్ప ఒకరిని ఉద్ధరించడానికి కాదు" అన్నారాయన.

"ఉద్ధరించడానికని నేనడం లేదు. నిరక్షర కుక్షులు అధికంగా వున్న దేశంలో రచనలద్వారా ఉద్ధరించడం ఎవరికీ సాధ్యం కాదు. మీరు సొంతంగా వేసుకుందికి మీకు ఆర్థికావకాశాలు లేవు. పోనీ నేను ఏ పబ్లిషర్‌కైనా పంపించి చూస్తాను. వాళ్ల స్పందన ఎలావుంటుందో చూద్దాం. నన్ను కాదనకండి" అని ప్రాధేయపూర్వకంగా అన్నాను.

"సరే, మీరు అంత ఇదిగా అంటూంటే నేనెందుక్కాదనాలి. ప్రయత్నించండి" అన్నారాయన.

నేను ఆ పుస్తకాలన్నిటినీ వదిలి కొందరు పబ్లిషర్స్‌కి పంపంచాను.

"అయ్యా! ఇప్పుడీ రచనలకు మార్కెట్ లేదు, రకరకాల టీవీ ఛానల్స్ వచ్చాక మా వ్యాపారానికి దెబ్బ తగిలింది. ఎవరైనా సొంతంగా వేసుకున్న పుస్తకాలుంటే కమీషన్ మీద మార్కెట్ చేస్తున్నాం. అమ్ముడు కానిపుస్తకాలు ఆరచయితలకు తిప్పి పంపే షరతు మీద" అని ఆ పబ్లిషర్స్ నుండి సమాధానంవచ్చింది.

"నేను చెప్పేను కదండీ! నాకు తెలుసు పబ్లిషర్స్ ఎవరూ ముందుకు రారని" అన్నారు బృందారకస్వామిగారు. ఇటువంటి బృందాకరస్వామి గారు అమరపురికి చేరేసరికి ఆయన మూడో కొడుకు శితికంఠం ఒక్కడే ఆయన పక్కన ఉన్నాడు. అద్వితీయుడు అమెరికాలోనూ, ద్వితీయుడు దుబాయ్‌లోనూ వున్నారు.

తండ్రి కాలం చేసినట్లు వారికి వార్త అంది ఇండియా వచ్చేసరికి, శవం చివికిపోయి చెడుకంపు కొడుతుంది. అంచేత ఇరుగుపొరుగు వారి సహకారంతో దహనకాండ జరిపించాము. ఆ తరువాత కొడుకులిద్దరూ విదేశాలనుండి వచ్చి, మూడోతమ్ముడు శితికంఠానికి కొంతడబ్బు ముట్టజెప్పి మాసికాలు జరిపించ మన్నారు. సంవత్సరికాలునాటికి తాము వచ్చి "ఇతర కార్యక్రమాలు జరుపుకుందా" మన్నారు.

కాలచక్రం ఎంత వేగంగా తిరుగుతుందో అనడానికి సాంవత్సరికం త్వరలో రావడమే నిదర్శనం. పెద్దకొడుకులిద్దరూ విదేశాలనుండి వచ్చి మూడురోజులు కార్యక్రమం పూర్తయ్యేక, బంధుమిత్రులు ఎవరిస్థలాలకు వాళ్లు వెళ్లి పోయారు.

ముగ్గురు కొడుకులూ తమ భార్యలతో సహా కూర్చుండగా, ముందు పెద్దకొడుకు సంభాషణ ప్రారంభించాడు.

"బుజ్జి తమ్ముడూ! మేమిద్దరం విదేశాల్లో వుంటున్నాం. నువ్వొక్కడివే ఈ దేశంలో వున్నవాడివి. కనుక ఇప్పుడున్న మన ఇంటిని అమ్మేసి, ఎవరి వాటా వారు తీసేసుకుందాం" అన్నాడు.

"ఔన్రా! అలాగే చేద్దాం" అన్నాడు రెండోవాడు.

"మీ ఇద్దరికీ వారసత్వపు ఇంటిమీద ఆసక్తి లేనప్పుడు, నేను మాత్రం కాదంటానా? అలాగే కానిండీ" అన్నాడుశితికంఠం. "కానీ నాకు నాన్నగారి ఆస్తిమీద ఆసక్తి లేదు. మీరే ఇంటిని అమ్మిన డబ్బుని తీసుకెళ్లండి. నాన్నగారు రాసిన పుస్తకాలు చాలు నాకు. అవి నా శక్తి కొద్దీ అచ్చు వేయిద్దామనుకుంటున్నాను"

పెద్దన్నలిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు 'వీడో వెర్రిబాగులాడిలా వున్నాడే' అన్నట్లు.

ఇల్లు అమ్మకం అయిపోయింది. అన్నలిద్దరూ మూడువాటాల్ని తామే తీసేసుకున్నారు ఆఖరి తమ్ముడి కోరిక మీద. శితకంఠం భార్య కొంచెం నొచ్చుకున్నా, అంతకుముందే ఆమెను ఒప్పించడం వల్ల మౌనం వహించింది.

శితికంఠం తన దారా పుత్రికలతో, తన తండ్రిగారి పుస్తకాల బొక్కి బీరువాను తీసుకుని అద్దె ఇంటికి మారిపోయాడు. అదృష్టవశాత్తూ తన కుమార్తెలిద్దరూ ఉన్నత విద్యావంతులై ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

"నాన్నగారూ! తాతగారు రాసిన పుస్తకాలను మా డబ్బుతో మేం అచ్చు వేయిస్తాం మీరు ప్రెస్ వాళ్లతో మాట్లాడండి" అన్నారు కుమార్తెలిద్దరూ.

శితికంఠం తటాపటాయించాడు. "తల్లీ! మీరు మునుముందు వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడాలి. తొందరపడి నిర్ణయం చేస్తే ఇబ్బంది పడతామేమో?"

"ఏం ఫర్వాలేదు నాన్నగారూ! మీరు పుస్తకాలు వేయించండి. ప్రింటింగ్ పని పూర్తయ్యేక, సమయం వచ్చినప్పుడు మా జీవిత భాగస్వాముల్ని ఎన్నుకుంటాం" అన్నారు ఏకగ్రీవంగా.

"సరే తల్లీ! మీరెలాగంటే అలాగే" అన్నాడు శితికంఠం.

మహావిష్ణువు పది అవతారాలెత్తి ఎంతోమంది రాక్షసుల్ని చంపాడు. కాని, ముద్రారాక్షసుల్ని చంపడం మాత్రం అతనికి సాధ్యం కాలేదు.

తన తండ్రి పుస్తకాలను ప్రింటింగ్ ప్రెస్‌కిచ్చి, ప్రూఫ్‌లు చూస్తూ ముద్రారాక్షసుల్ని సాధ్యమైనంతవరకూ సంహరిస్తూ తండ్రిగారి పుస్తకాల ముద్రణ పూర్తి చేశాడు శితికంఠం.

కొందరు పబ్లిషర్స్‌తో ముందుగా మాట్లాడి, కమీషన్ మీద అమ్మడానికి 'ప్రతులు

దొరుకుచోటు' అని ముందు పేజీలలో వేయించాడు.

బుక్ పబ్లిషర్స్ కొందరు పదిశాతం డిస్కౌంట్ మీద బుక్ ఎగ్జిబిషన్స్‌లో శితికంఠం తండ్రిగారైన బృందారకస్వామిగారి పుస్తకాలను కూడా ప్రదర్శించారు. కొందరు పుస్తక ప్రియుల దృష్టి, బృందాకర స్వామిగారి పుస్తకాల మీద పడ్డాది. "చూద్దాం ఎలా వుంటుందో" అంటూ ఒకరు కొన్నారు. అది చదివి పుస్తకం బాగుందని ఇంకొకరితో చెప్పారు. అలా అలా మరికొంతమంది పాఠకుల దృష్టికి వెళ్లింది. కొందరు పి.జి. పూర్తి చేసిన విద్యార్థులు, తాము ఎం.ఫిల్ చేస్తే ఎలా వుంటుందా అని. మరికొందరు పి.హెచ్.డి. థీసిస్ సబ్‌మిట్ చేస్తే ఎలావుంటుందా అని తమ తమ గైడ్స్ దృష్టికి తీసుకెళ్లారు. గైడ్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఆ విధంగా బృందారకస్వామిగారి పుస్తకాలకి మంచి ప్రాచుర్యం వచ్చింది.

సమీక్ష అంటే సమంగా చూడడం పూర్తిగా పుస్తకం బావులేదన్నా, బావుందన్నా అది సమీక్ష ఎలా అవుతుంది? మాస, వార, దిన పత్రికలు ఎక్కువ భాగం సమీక్షలు సానుకూలంగా చేశాయి.

మా చిరపరిచితుని కొడుకే కదా శితికంఠం అని ఒకనాడు పలకరిద్దా మని వెళ్లాను. కాఫీ పలహారా లయ్యాక ప్రస్తావనలో శితికంఠం అన్నాడు.

"అనేక విశ్వవిద్యాలయాలు మా నాయనగారి పుస్తకాలను పాఠ్య గ్రంథాలుగా స్వీకరించాయి. పది మంది సిద్ధాంతవ్యాసాలు రాసి పి.హెచ్.డి. పట్టా పొందారు. వారంతా వివిధ కళాశాలల్లో లెక్చరర్లు గాను, రీడర్లుగాను పనిచేస్తున్నారు. మరికొందరు విద్యార్థులు, ఈ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో పి.హెచ్.డి. పట్టాకోసం సిద్ధాంత వ్యాసాలు రాస్తున్నారు. వారు ఆ విధంగా కొన్నివేలమందికి జ్ఞాన దీపాల్ని వెలిగిస్తున్నారు. 'జ్ఞాన దీపేన భాస్వతా' అని కృష్ణభగవానుడు చెప్పినట్లు 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును' అన్న మహాకవి గురజాడ సూక్తిని తమ శక్తి మేరకు నిజం చేయడానికి విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు. అంతకన్నా నాక్కావలసిందేమిటి చెప్పండి బాబాయ్" అన్నాడుశితికంఠం ఎంతో తృప్తిగా.

శితికంఠం వంటి సంతృప్తిపరులు చాలా కొద్దిమందే వుంటారనిపించింది నాకు. మేడలూ, మిద్దెలూ, భూములూ ఈ సంపదకు వారసత్వం కోసం అందరూ సిగపట్ల గోత్రానికి దిగుతారు. సాహిత్య వారసత్వ సంపద కోరే వాళ్లెంతమంది? వేళ్లతో లెక్కించవచ్చు, అందులో ఒకవేలు శితికంఠం అని సగర్వంగా చెప్పగలను!

ఒకసారి నెహ్రూ పండితులు క్రిందినుండి మీదికి లిఫ్ట్‌లో వెళుతున్నారు. సడన్‌గా కరంటు పోయింది. వెంటనే తన లాంగ్ కోటునుంచి పుస్తకం తీసి కరంటు వచ్చేదాకా చదివేరు. "లిఫ్ట్‌లో కరంటు పోయినప్పుడు ఈ పుస్తకమే నా నేస్తం" అని చమత్కరించారు. అలాగే శితికంఠం పితృపాదులైన బృందారకస్వామి గారి పుస్తకాలు క్రమేణ పుస్తక ప్రియులకు నేస్తాలయ్యాయి!

**7-12-2002**

**ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక**